సాక్షి జోగులాంబ గద్వాల

సోమవారం ‌। 4 ‌। మార్చి ‌। 2024

గరిష్టం/కనిష్టం
38.2/22.3

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి 'ప్రజావాణి' రద్దు

గద్వాలరూరల్: జిల్లాలో స్థానిక సంస్థల శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నాడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ సంతోష్ ఒక్క ప్రకటనలో తెలిపారు. విషయాన్ని ప్రజలు గమనించి ఎవరూ కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు అందజేసేందుకు రావద్దని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బంగారు శ్రుతి



సాక్షి, నాగర్‌కర్నూల్: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు కుమారుడు భరత్‌ప్రసాద్‌ను బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం శనివారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ నుంచి బీజేపీ తరఫున టికెట్ ఆశించిన బంగారు శ్రుతి ఆదివారం అనూహ్యంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఆమెను 'సాక్షి' సంప్రదించగా.. తాను వ్యక్తిగత పనులపై మాత్రమే సీఎంను కలిశానని, నాగర్‌కర్నూల్ ఎంపీ సీటు విషయంలో బీజేపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం మేరకు కట్టుబడి ఉంటానని, పార్టీ కోసం పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పదో బెటాలియన్‌లో ఉన్న కనకదుర్గ ఆలయాన్ని ఆదివారం కమాండెంట్ సాంబయ్య దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వారు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ దాత తిరుమల మహేష్‌తో కలసి వారు వేదమంత్రాల నడుమ ధ్వజస్తంభాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, ఆర్‌ఐలు రాజారావు, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీదర్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అంతర్రాష్ట్ర భజన పోటీలు



అయిజ: తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో శనివారం రాత్రి నుంచి ఆలయ కమిటీ వారు అంతర్రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించారు. ఆదివారం విజేతలను ప్రకటించారు. పర్దిపురంకు చెందిన మారుతి భజన మండలి మొదటి బహుమతిని గెలుచుకుంది. అదేవిధంగా 2వ బహుమతిని ముండ్లవోనిపల్లికి చెందిన రామాంజనేయ స్వామి భజన మండలి, 3వ బహుమతిని వడ్డెపల్లికి చెందిన శివ మారుతి భజన మండలి, 4వ బహుమతిని కర్నూలుకు చెందిన పంచాక్షరి భజనమండలి, 5వ బహుమతిని అల్లీంనగర్‌కు చెందిన సీతారామాంజనేయ స్వామి భజన మండలి కైవసం చేసుకున్నాయి. 6వ బహుమతిని తుమ్మిల్లకు చెందిన వీరాంజనేయ స్వామి, 7వ బహుమతిని కొంకలకు చెందిన వీరాంజనేయ స్వామి, 8వ బహుమతిని పర్దిపురంకు చెందిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి భజన మండలిలు కైవసం చేసుకున్నాయి.



గద్వాల శివారులో సాగు చేసిన క్యాలీఫ్లవర్

కూరగాయల.. రైతు విలవిల

పెరిగిన ఉష్ణోగ్రతలు
- భూమిలో తగ్గిన తేమశాతం
- రాలుతున్న పూత.. మారుతున్న రంగు

గద్వాల వ్యవసాయం: కూరగాయలు సాగు చేసిన రైతులు విలవిలలాడుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో యాసంగిలో కూరగాయల సాగు బాగా తగ్గించారు. బోర్లలో ఉన్న నీటి లభ్యత ఆధారంగా సాగు చేసిన కూరగాయల పంటను అధిక ఉష్ణోగ్రతలు దెబ్బతీస్తున్నాయి. ఎండల తీవ్రతతో పూతలు రాలుతున్నాయి. కాయలు వచ్చిన చోట వాటి రంగులు మారుతున్నాయి. వాతావరణ మార్పులతో దిగుబడులు తగ్గి, ఆర్థికంగా నష్టాలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో కూరగాయల సాగు..

జిల్లాలో సాధారణ పంటలతో పాటు కూరగాయలను ఏటా విస్తారంగా పండిస్తారు. రెండు సీజన్లతో కలిపి ఏటా దాదాపు 10వేల ఎకరాల్లో ఇక్కడి రైతులు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తారు. గద్వాల మండలంలో వంకాయ, బెండ, పచ్చిమిర్చి, చిక్కుడు, క్యాలిఫ్లవర్, క్యాబేజీ ధరూర్ మండలంలో బెండ, టమాట మల్దకల్ మండలంలో చిక్కుడు, టమాట, బీర,



వంకాయలు తీసుకొస్తున్న కూలీలు

సోరకాయ, బెండ, కాకర అయిజలో బెండ, చిక్కుడు వడ్డేపల్లిలో వంకాయ, బెండ, కాకర, క్యాబేజీ, క్యాలిఫ్లవర్, ఉల్లి, అలంపూర్‌లో ఉల్లి, రాజోళిలో పచ్చిమిర్చి, ఉల్లి, టమాట గట్టు, కేటీదొడ్డి మండలాల్లో టమాటతో ఆయా మండలాల్లో ఆకుకూరలు సైతం సాగు చేస్తారు. తమకున్న పొలంలో రెండు నుంచి ఐదు ఎకరాల్లో బోర్లు, బావుల కింద రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు.

యాసంగిలో తగ్గిన సాగు..

వానాకాలంలో ఆశించిన స్థాయిలో పడకపోగా, సగటు వర్షపాతం ఏ మండలంలోనూ నమోదు కాలేదు. దీని ఫలితంగా భూగర్భ జలాల నీటి మట్టాలు తగ్గి పోయాయి. బోర్లు, బావుల్లో జలాలు తగ్గిపోవడాన్ని ఉద్యానశాఖ అధికారులు గుర్తించారు. యాసంగిలో అనుకున్నంత కూరగాయల సాగు కాదు అని నిర్ధారణకు వచ్చారు. ఆయా మండలాల్లో అందుబాటులో ఉన్న నీటి వనరుల ఆధారంగా 2943 ఎకరాల్లో కూరగాయలు సాగు అవుతాయని అంచనా వేశారు. ఏటా యాసంగిలో కనీసం 4వేల ఎకరాల్లో సాగు అవ్వాల్సి ఉండగా ఈసారి 2034 ఎకరాల్లో మాత్రమే వివిధ రకాల కూరగాయల సాగు అయ్యింది.

మండలాల వారీగా కూరగాయల సాగు ఇలా...

మండలం	సాగు చేసింది (ఎకరాల్లో..)
మల్దకల్	350
గద్వాల	320
ధరూర్	270
వడ్డేపల్లి	255
అయిజ	215
ఇటిక్యాల	150
రాజోళి	119
గట్టు	95
కేటీదొడ్డి	80
అలంపూర్	70
మానవపాడు	60
ఉండవెల్లి	50

రంగు మారుతున్నాయి



నాకు గద్వాల శివారులో మూడెకరాల పొలం ఉంది. క్యాప్సికం, టమాట, వంకాయ సాగు చేశాను. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల క్యాప్సికం, టమాటల రంగులు మారుతున్నాయి. అవి చెట్టుపైనే తెల్లగా మారుతున్నాయి. టమాట చెట్టుపైనే మెత్తపడిపోతోంది. ఆర్థికంగా ఈసారి చాలా నష్టమే.

– సుదర్శన్‌రెడ్డి, కూరగాయల రైతు, గద్వాల

అధిక ఉష్ణోగ్రతల ప్రభావమే..



గత కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు ఎక్కువయ్యాయి. దీని ప్రభావం కూరగాయల పంటలపై ఉంటుంది. ఎండవేడిమి తగలకుండా షెడ్ నెట్‌లు ఏర్పాటు చేసుకోవాలి. కాయలు, పూతలు రాలకుండా తగిన యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. రైతులు ఉద్యానశాఖ అధికారుల, సిబ్బంది సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– ఎంఏ అక్బర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

ఎండలు భగభగ

వర్షాలు రాకపోయిన బోర్లలలో, బావుల్లో ఉన్న నీటి లభ్యత ఆధారంగా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల రైతులు కూరగాయలు సాగు చేశారు. కొంతమంది రైతులు విత్తనాలు వేయగా, చాలా మంది నారుతో కూరగాయలు వేశారు. అయితే గడిచిన ఇరవై రోజుల నుంచి వాతావరణంలో చాలా మార్పులు వచ్చాయి. తెల్లవారుజామున చలిగా ఉంటుండగా ఉదయం 9గంటల నుంచే ఉష్ణోగ్రతలు మొదలవుతున్నాయి. అప్పటి నుంచి క్రమేణ ఎండల తీవ్రత పెరుగుతూ వస్తోంది. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి ఉంటోంది. అధికంగా నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. దీనికి తోడు వర్షాలు లేకపోవడం వల్ల భూమిలో తేమశాతం తగ్గిపోయింది. దీనివల్ల కూరగయాల పూతలు రాలుతున్నాయి. మొక్క పెరగడం లేదు. పూతలు వచ్చి కాయలు పట్టిన చోట వాటి రంగులు మారుతున్నాయి. ఎండవేడిమికి టమాట, క్యాప్సికం, క్యాలిఫ్లవర్, కాకర, బీర, వంకాయ తదితర కూరగాయల రంగులు మారి, సైజులు తగ్గిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుపైనే కాయలు కుచించుకుపోతున్నాయని అంటున్నారు. దిగుబడి తగ్గిపోవడమే కాకుండా, కాసిన కాయలు కూడా రంగులు మారి, వట్టిపోయిన వాటిలా మారుతున్నాయని వాపోతున్నారు. పెట్టిన



ఎండకు మొక్కపైనే రంగు మారిన టమాట

పెటుబ్బడులు వచ్చే పరిస్థితులు కనబడటం లేదని, ఆర్థికంగా నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు.

చుక్కల మందు @ 96శాతం

- జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో ప్రారంభం
- మొదటి రోజు 71వేల మందికి పోలియో చుక్కలు



జమ్మిచేడులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ శశికళ

గద్వాల రూరల్: జిల్లాలో చుక్కల మందుకు చక్కని స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో 96.25శాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 0–5ఏళ్ల వయసున్న పిల్లలు సుమారు 73,870మంది ఉండగా.. 71,099 మందికి పోలియో చుక్కలు వేశారు. జిల్లా వ్యాప్తంగా 448 పోలియో కేంద్రాలు, 899 వైద్యబృందాలు, 1792మంది వైద్యసభ్యులు, 42పోలియో రూటు సూపర్‌వైజర్లు, 94 మైగ్రేటరీ మరియు హైరిస్క్ సైట్స్ టీంలు పనిచేశాయి. 3, 4 తేదీలలో పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తొలిరోజు పోలింగు కేంద్రాల వద్ద, రెండో రోజు వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి 5ఏళ్లలోపు వయసున్న చిన్నారులను గుర్తించి పోలియోచుక్కలు వేయనున్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు..

ఐదేళ్లలోపు వయసున్న పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అవి పిల్లల జీవితాలకు రక్షణ కవచాలుగా పనిచేస్తాయని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ అన్నారు. ఆదివారం గద్వాలలోని జమ్మిచేడులో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జమ్మిచేడులోని అంగన్‌వాడి కేంద్రంలో 0–5ఏళ్ల వయసున్న చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈసందర్భంగా ఆమే మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 73,870మందికి గాను 71వేల మందికి మొదటి రోజు విజయవంతంగా చుక్కలు వేశామని, మరో రెండు రోజులు ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేస్తారన్నారు. ఈమేరకు తమ సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయనున్నట్లు ఇందుకోసం ఇప్పటికే వారికి అవసరమైన సూచనలు జారీ చేసినట్లు వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప జిల్లావ్యాప్తంగా పోలియో కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్రవంతి, వైద్యసిబ్బంది మదన్‌మోహన్‌రెడ్డి, నరేంద్రబాబు, తిరుమల్‌రెడ్డి, వరలక్ష్మి, రవి, చందర్, కవిత ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎంపీ స్థానాలను సీఎంకు బహుమతిగా ఇద్దాం

- పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యత కార్యకర్తలదే
- బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలను గజమాలతో సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి పాలమూరులోని రెండు ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి, సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గౌడ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి పొన్నంతోపాటు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి, సమన్వయంతో ముందుకు సాగుతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని ఈనెలాఖరు వరకు నెరవేరుస్తామన్నారు. ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టంచేశారు. అందరికీ విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇన్ని రోజులు కుటుంబ పాలన సాగిందని.. ఇప్పుడు ప్రజాస్వామ్య ప్రభుత్వం వచ్చిందన్నారు.

పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు కృషి..

మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సౌమ్యుడని, పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. మహావీరుల సంకల్పం ఉన్న గౌడలు ఏదైనా సాధిస్తారని చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేసే వారిని గెలిపిస్తే ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్, కౌన్సిలర్ లక్ష్మణ్‌యాదవ్, మీడియా సెల్ కన్వీనర్ బెనహర్, చంద్రకుమార్‌గౌడ్, యుగంధర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



డిండి చింతపల్లి బ్రిడ్జి మీదుగా పాదయాత్ర ద్వారా శ్రీశైలం వెళ్తున్న శివస్వాములు

నల్లమల దారిలో..

అభయారణ్యంలో ప్రతిధ్వనిస్తున్న పంచాక్షరి జపం

హరహర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమః శివాయ.. శివాయ నమ ఓం.. అంటూ నల్లమల అటవీ ప్రాంతం శివనామస్మరణతో మారుమోగుతోంది. ప్రతిఏటా శ్రీశైలంలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. శివదీక్ష చేపట్టిన భక్తుల శరణు ఘోషతో నల్లమల ప్రతిధ్వనిస్తోంది. శివస్వాములు వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన శ్రీశైలం చేరుకొని మహాశివ రాత్రి సందర్భంగా దీక్ష విరమిస్తారు. ఈ క్రమంలో నల్లమల దారి పొడవునా పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే వారికి అడుగడుగునా దాతలు తమకు తోచిన సహాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు. విడిది కేంద్రాలు, అన్నదానాలు, నీళ్ల ప్యాకెట్ల వితరణ, ప్రథమ చికిత్స అందిస్తూ తమలోని సేవాగుణం చాటుకుంటున్నారు.

– అచ్చంపేట

- మండుటెండలో శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర
- కైలాసనాథుడిని స్మరించుకుంటూ ముందుకు..
- అడుగడుగునా ఉట్టిపడుతున్న దాతల సేవాభావం
- పాదయాత్ర చేస్తున్న వారికి అన్నదానాలు, విడిది కేంద్రాల ఏర్పాటు

పాదయాత్రగా శ్రీశైల మహాక్షేత్రం వెళ్లే స్వాములకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొచ్చి షామియానాలు, ఉచిత భోజన, మంచినీటి వసతితోపాటు అల్పాహారం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రధానంగా అచ్చంపేట, ఉమామహేశ్వరం, మన్ననూర్, పర్హాబాద్, వటువర్లపల్లి, రాసమల్లబావి, దోమలపెంటలో దాతలు ఏర్పాటు చేసిన విడిది కేంద్రాల వద్ద దాతలు అన్నదానం చేస్తున్నారు. అచ్చంపేట– శ్రీశైలం నల్లమల అభయారణ్యంలో ప్రతి ఏటా 20కిపైగా అన్నదాన కేంద్రాలు వెలిశాయి. మన్ననూర్ తర్వాత వటువర్లపల్లి వరకు ఎక్కడ కూడా వీరికి తాగేందుకు గుక్కెడు నీరు కూడా దొరకని పరిస్థితి ఉంది. వటువర్లపల్లి తర్వాత మళ్లీ దోమలపెంట వరకు ఇదే పరిస్థితి ఉంటుంది.

ఈ సూచనలు పాటించాలి..

పాదయాత్ర ద్వారా వచ్చే శివస్వాములు, భక్తులకు అటవీ, పోలీస్ శాఖలు ప్రత్యేక సూచనలు చేస్తోంది. నల్లమలలో అగ్ని ప్రమాదాల నివారణకు తెలంగాణ అటవీ శాఖ ప్రత్యేక ఆంక్షలు విధించింది. అమ్రాబాద్ అభయారణ్యంతో పాటు రక్షిత ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు ప్రత్యేక పెంట్రోలింగ్ నిర్వహించనున్నారు. పాదయాత్ర చేసే స్వాములకు జంతువుల నుంచి ప్రాణహాని కలగకుండా అటవీ మార్గంలో సిబ్బందితో టీంలు ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధంపై భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు.

- శివస్వాములు, భక్తులు అడ్డదారుల్లో వెళ్లకుండా.. నిర్దేశించిన ప్రాంతాలు, రోడ్డు మార్గంలో ప్రయాణించాలి. అడవి మార్గంలోని కాలిబాటలో ప్రయాణం నిషేధించారు.
- ముఖ్యంగా బీటీ రహదారిపై నడిచే భక్తులు రోడ్డుకు మధ్యలో నడవకుండా.. ఎడమ వైపు నుంచి నడవాలి.
- రోడ్డుపై విశ్రాంతి తీసుకోకూడదు. కేవలం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విరామ ప్రాంతాల్లో మాత్రమే సేదతీరాలి.
- అటవీ ప్రాంతంలో వంటలు చేయడం, నిప్పు రాజేయడం నిషేధం. ఈ నిబంధన ఉల్లంఘించి అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వారిపై అటవీ శాఖ చర్యలు తీసుకుంటుంది.
- స్వాములు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు అడవిలో పడేయవద్దు.
- మన్ననూర్, వటువర్లపల్లి వద్ద శివస్వాములకు దాతల సహాయంతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం ఏర్పాట్లు ఉన్నాయి.
- రాత్రిపూట పాదయాత్ర చేసే శివస్వాములు టార్చిలైట్ లేదా ముందు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి రహదారి సూచనగా తెల్లగుడ్డ కట్టాలి.
- అడవి మధ్య మార్గంలో కోతులతో జాగ్రత్తగా ఉండాలి. తినే పదార్థాలు కోతులకు వేయరాదు.
- ప్రధానంగా శివస్వాములకు రహదారి వెంట ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అమ్రాబాద్ సీఐ సెల్ నం.8712657739, ఈగలపెంట ఎస్‌ఐ సెల్ నం. 8712657741లను సంప్రదించాలి.



ఉమామహేశ్వరంలో సేదతీరుతున్న భక్తులు



ఎలా వెళ్తున్నారంటే..

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి పాదయాత్ర ద్వారా శివస్వాములు శ్రీశైలం వెళ్తున్నారు. జిల్లాలోని మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, అలంపూర్, నారాయణపేట, కొడంగల్, దేవరకద్ర, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చేవారు నాగర్‌కర్నూల్– అచ్చంపేట మీదుగా శ్రీశైలం వెళ్తుండగా.. తాండూరు, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, షాద్‌నగర్, జడ్చర్ల, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాల వారు కల్వకుర్తి మీదుగా కొండారెడ్డిపల్లి, డిండిచింతపల్లి, హాజీపూర్, మన్ననూర్ మీదుగా.. నల్లగొండ, మిర్యాలగూడ, ఖమ్మం నుంచి వచ్చే స్వాములు డిండి– అచ్చంపేట మీదుగా శ్రీశైలానికి చేరుకుంటున్నారు. పెబ్బేరు, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, వీపనగండ్ల, పానగల్, కోడేరు మండలాల వారు లింగాల– అచ్చంపేట మీదుగా శ్రీశైలం వెళ్తున్నారు.

రాత్రివేళలోనే ఎక్కువగా..



పాతయాత్ర చేయడం వల్ల మనసుకు ఆనందం కలుగుతుంది. నేను ఈ ఏడాది కొత్తగా మాలధారణ స్వీకరించి శ్రీశైలం పాదయాత్ర చేస్తున్నా. మా ఊరి నుంచి 25 మందితో గురువారం మధ్యాహ్నం బయలుదేరి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ మీదుగా శనివారం ఉదయం అచ్చంపేటకు చేరాం. సోమవారం శ్రీశైలం చేరుకుని స్వామి దర్శనం చేసుకుంటాం. రాత్రివేళ ఎక్కువ నడక సాగిస్తున్నాం. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల పగలు బాట సాగడం లేదు.

– శ్రీను, శివస్వామి, మద్దూరు

దేవుడిపై భారం వేసి..



మేము శివుడిపై భారం వేసి నడక సాగిస్తాం. మాలధారణ తీసుకున్నప్పటి నుంచి నిష్టతో ఉంటాం. దారి వెంట దాతలు చేసే అన్నదానం, మంచినీరు, అల్పాహారం తీసుకుంటున్నాం. దాతలు ఏర్పాటు చేసిన బస కేంద్రాల్లో నిద్రిస్తాం. శుక్రవారం వనపర్తిలో బయలుదేరి గోపాల్‌పేట, తూడుకుర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా శనివారం ఉదయం అచ్చంపేటకు వచ్చాం. మాలధారణ చేపట్టి ఐదేళ్లు అవుతుంది.

– బాలకృష్ణ, శివస్వామి, వనపర్తి

రోడ్డు మార్గంలోనే వెళ్లాలి



మన్ననూర్ నుంచి సార్లపల్లి, వటువర్లపల్లి మీదుగా అడవిలో వెళ్తున్నారు. ఆ మార్గంలో జంతువుల నుంచి ప్రమాదం ఉంటుంది. ఆ మార్గంలో వెళ్లకుండా ఇప్పటికే బోర్డులు ఏర్పాటు చేశాం. రోడ్డు మార్గంలో వెళ్లడం సురక్షితంగా ఉంటుంది. ధారారం బేస్ క్యాంపు, రాసమల్లబావి వద్ద శివస్వాములకు తాగునీటి వసతి కల్పిస్తున్నాం. 14 మంది సిబ్బందితో చెత్త తీసేస్తున్నాం. తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి చెత్త, కవర్లు తీయిస్తాం. మా టీంలు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు.

– రోహిత్‌గోపిడి, డీఎఫ్‌ఓ



మన్ననూరు వద్ద పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

క్లుప్తంగా

మహిళ బలవన్మరణం

గోపాల్‌పేట: పురుగుమందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జయన్న తిర్మలాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటయ్యకు ఐదుగురు సంతానం కాగా.. నాలుగో కుమార్తె పార్వతమ్మ (26)ను అడ్డాకుల మండలం శాఖాపూర్‌కు చెందిన రామకృష్ణకు ఇచ్చి 2013లో వివాహం జరిపించారు. కాగా 2014లో రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పార్వతమ్మ కుమార్తెతో కలిసి జయన్న తిర్మలాపూర్‌లో కిరాణ దుకాణం ఏర్పాటుచేసుకొని జీవనం సాగిస్తుండేది. గ్రామంలోని ఓ యువకుడితో ఆమె చనువుగా ఉంటుండగా.. అతడికి ఇటీవల పెళ్లి కుదిరింది. దీంతో మనస్తాపానికి గురైన పార్వతమ్మ శనివారం సాయంత్రం ఇంట్లో పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే వనపర్తి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: చెరువులో పడిన ఓ వృద్ధుడి మృతదేహం ఆదివారం లభ్యమైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన మహ్మద్ యాకూబ్ (70) 1వ తేదీన జిల్లాకేంద్రంలోని కేసరి సముద్రం చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. ఆదివారం మృతదేహం నీటిపై తేలియాడుతుండగా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

దామరగిద్ద: చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి గల్లంతైన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన నాగప్ప (45) అదే కాలనీకి చెందిన అరవింద్‌తో కలిసి సాయంత్రం 5 గంటల సమయంలో చేపలవేట కోసం స్థానిక కొత్తచెరువుకు వెళ్లారు. వల వేస్తున్న సమయంలో నాగప్ప నీటిలో మునిగిపోగా అరవింద్ వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులకు సమాచామిచ్చారు. యువకులు చెరువులో గాలించినా దొరక్కపోవడంతో భార్య నీలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చీకటి పడటంతో సోమవారం గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని వెలికి తీయనున్నట్లు పోలీసులు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాన్‌గల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు మండలం కొత్తసూగూర్‌కు చెందిన సయ్యద్ గాలీబ్‌పాష(49) వెల్డింగ్ పనులు చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని బుసిరెడ్డిపల్లిలో ఫిబ్రవరిలో నూతన గృహానికి వెల్డింగ్ పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తుండగా.. పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు ఇనుప రాడ్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు గురై గాయాలయ్యాయి. వెంటనే పెబ్బేర్ ఆస్పత్రికి అక్కడి నుంచి జిల్లా ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలియజేశారు. ఈ మరణంపై మాకు ఎలాంటి అనుమానాలు లేవని ప్రమావశాత్తుతో విద్యుత్ షాక్‌కు గురికావడంతోనే మా భావ మృతిచెందినట్లు మృతుని బావమర్ది సయ్యద్ నజీమోద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

దేవరకద్ర: కౌకుంట్ల, పేరూర్ గ్రామాల మధ్య 149వ కిలోమీటర్ రాయి వద్ద ఆదివారం ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌకుంట్లకు చెందిన మన్యంకొండ(29) నాలుగు సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం కడుపు నొప్పి భరించలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వివాహిత అదృశ్యం

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లకు చెందిన గడ్డం వనజ రెండ్రోజులుగా కనిపించడం లేదని ఆమె సోదరుడు గడ్డం విఠల్ ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. వనజను నల్గొండ జిల్లా డిండి మండలం చెర్కుపల్లికి చెందిన గోరటి ఆంజనేయులుకు ఇచ్చి వివాహం జరిపించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో కొన్నిరోజులుగా తల్లిగారి ఇంటివద్దే ఉంటోంది. మాత్రలు వేసుకోవాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 1న శుక్రవారం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. ఎక్కడ వెదికినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

భరోసా ఏది?

చాలీచాలని కూలితో బీడీ కార్మికుల బతుకు పోరాటం

ఏళ్లకు ఏళ్లు కష్టపడి పనిచేసినా బీడీ కార్మికుల చేతిలో చిల్లి గవ్వలేని దైన్య స్థితి. ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటిల్లిపాది బీడీలు చుట్టినా సరిపడా కూలీ అందదు. ఇక పీఎఫ్.. గ్రాట్యూటీ.. సరైన విద్య, వైద్యం జాడే కరువైంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని దాదాపు 30వేల మంది బీడీ కార్మికులకు భరోసా లేక పేదరికంలోనే కొట్టుమిట్టాడుతున్నారు. అటు ప్రభుత్వం.. ఇటు యాజమాన్యాలు అయినా స్పందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


బీడీలు చుడుతున్న కార్మికులు

- పీఎఫ్, గ్రాట్యూటీ లేక జీవనభృతికి ఇబ్బందులు
- యాజమాన్యాలు, ప్రభుత్వం పట్టించుకోని వైనం
- ఉమ్మడి పాలమూరులో 30వేల మంది బీడీ కార్మికులు


చిన్నచింతకుంటలో వందేళ్లుగా కొనసాగుతున్న చంద్ర మార్క్ బీడీ పరిశ్రమ

చిన్నచింతకుంట: ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీడీ పరిశ్రమపై ఆధార పడి దాదాపుగా 30వేల మంది కార్మికులు జీవనం కొనసాగిస్తున్నారు. బీడీలు చుడితేనే వారి బతుకు బండి సాగేది. కానీ, పీఎఫ్, గ్రాట్యూటీ, పనికితగ్గ కూలీ అందకపోవడంతో పూటగడవడమే కష్టమైంది. ప్రభుత్వ జీఓ 41 ప్రకారం కార్మికుడు వెయ్యి బీడీలు చుడితే రూ.500 చెల్లించాల్సి ఉంది. కానీ యాజమాన్యాలు, ప్రభుత్వం అట్టి జీఓ అమలును విస్మరించాయి. వెయ్యి బీడీలు చుడితే కేవలం రూ.207 దినసరి కూలీ చెల్లిస్తు అన్యాయం చేస్తున్నాయి. యాజమాన్య విధానం ప్రకారం మిగతా రూ.350 చెల్లించాల్సి ఉంది. కానీ ఆ విధానాన్ని కూడా యాజమాన్యం అనుసరించడంలేదు. కార్మిక సంఘాల ఒప్పందం ప్రకారం రెండు సంవత్సరాలకు ఒక్కసారి బీడీ కూలి రేటును పెంచాల్సి ఉంది. అయితే ఆ ఒప్పందం ప్రకారం ఈ సంవత్సరం బీడీ కూలి రేటు పెంచాల్సి ఉంది. ఈసారి అయిన యాజమాన్యం విధానం ప్రకారమైన రూ.350 చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

బీడీ పరిశ్రమ అడ్డాగా..

ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే చిన్నచింతకుంట బీడీ పరిశ్రమ కేంద్రంగా కొనసాగుతుంది. ప్రస్తుతం మండలంలో 14 బీడీ ఫ్యాక్టరీలు కొనసాగుతున్నాయి. అందులో రెడ్డిబీడీ, వస్తాద్ బీడీ, ఆజాంబీడీ, మూడు నెంబర్ బీడీ, అమృతం బీడీ, రింగ్ రెడ్డిబీడీ, చండూల్ బీడీ, చంద్రమార్క్ బీడీ, వజీర్‌బీడీ, అమీర్‌బీడీ, సంఘం బీడీ, సమ్మద్‌బీడీ, రఫిక్ రేకబీడీ లాంటి బీడీ పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఇన్ని ఫ్యాక్టరీలు ఉన్నా కార్మికులకు మాత్రం ఒక్కటి లేదా రెండు ఫ్యాక్టరీలలో మాత్రమే పీఎఫ్, ఈఎస్‌ఐ కార్డులు అందిస్తున్నాయి. మిగతా ఏ ఫ్యాక్టరీ యాజమాన్యాలు కూడా నిబంధనలు పక్కాగా అమలు చేయడంలేదు.

ప్రభుత్వ పథకాల అమలేదీ..?

వేలాది మంది కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధార పడి జీవనం సాగిస్తున్నప్పటికి ప్రభుత్వ పథకాలకు నోచుకోలేక పోతున్నారు. గుర్తింపు ఉన్న ఫ్యాక్టరీల్లో మాత్రమే కొంతమంది కార్మికులకు యాజమాన్యం గుర్తింపు కార్డులు అందిస్తుంది. గుర్తింపు లేని ఫ్యాక్టరీలలో పనిచేసే వేలాది మంది కార్మికులకు కార్డులు లేక ప్రభుత్వం అందించే పింఛన్, ఇండ్లు, ఉచిత వైద్యం వంటి పథకాలల్లో లబ్ధి పొందలేకపోతున్నారు. యాజమాన్యం గుర్తింపు కార్డులను జారీ చేసేలా పీఎఫ్ అమలు పరుస్తూ కార్మిక సంక్షేమ శాఖకు కార్మిక వాటాను జమచేయాల్సి ఉంది. యాజమాన్యాలు కేవలం కుటుంబానికి ఒక్క కార్డు మాత్రమే గుర్తింపుకార్డుగా ఇస్తు ఒక్కరికే కార్మిక వాటాను జమచేస్తున్నారు. దీంతో కుటుంబంలో ఉన్న మిగితా కార్మికులు పీఎఫ్ లబ్ధి పొందలేకపోతున్నారు. యాజమాన్యాలు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి కార్మిక వాటాను జమచేసి పీఎఫ్ కార్డులు అందించాలని కార్మికులు కోరుతున్నారు.

కూలి రేట్లు పెంచాలి



బీడీ పరిశ్రమపై ఆధార పడి జీవనం కొనసాగిస్తున్న కార్మికులకు ఏళ్ల తరబడి చాలీచాలని కూలి అందిస్తున్నారు. దీంతో ఇళ్లు గడవకపోవడంతోపాటు మా పిల్లలకు సరైన విద్య, వైద్యం అందించలేకపోతున్నాం. ఎంతోమందికి గుర్తింపు కార్డులు, పీఎఫ్‌లేక ప్రభుత్వ పథకాలకు నోచుకోలేకపోతున్నాం. యాజమాన్యం కార్మికుల ఇబ్బందులను గుర్తించి ఈ సంవత్సరం బీడీ కూలీ రేటు పెంచాలి. అలాగే గుర్తింపు కార్డులు అందించి మమ్ము ఆదుకోవాలి.

– శంకర్, బీడీ కార్మికుడు, పర్దీపురం

యాజమాన్యాలు ముందుకు రావాలి



బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మిక సంఘాలతో సమావేశాలకు ముందుకు రావాలి. కార్మిక సంఘాల ఒప్పందం ప్రకారం యాజమాన్యాలు ఈ సంవత్సరం కూలీ రేటును పెంచాలి. కనీసం యాజమాన్య విధానం ప్రకారం రూ.350 చెల్లించేలా చర్యలు చేపట్టాలి. ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డు, పీఎఫ్, గ్రాట్యూటీ అందించాలి. ప్రభుత్వం సైతం ప్రతి కార్మికుడికి సంక్షేమ పథకాల ఫలాలను, ఇండ్లు, వైద్యం, పిల్లలకు స్కాలర్‌షిప్ అందించేలా చూడాలి.

– యాదగిరి టీఎఫ్‌టీయూ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల్లో ముందుండి పనిచేయాలి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు గెలుపే ధ్యేయంగా ముందుండి పనిచేయాలని రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ యువజన స్థాయి కాంగ్రెస్ సమావేశంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయిలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి 'మై బూత్ టెన్ యూత్' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి బూత్‌లో చురుకైన పది మంది యువకులను ఎంపిక చేసి వారి వివరాలను పార్టీకి అందజేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్‌రెడ్డి గెలుపులో యువజన విభాగం క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేసే యువజన నాయకులకు సముచిత స్థానం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు. యువజన కాంగ్రెస్ పార్టీకి పట్టులాంటిదన్నారు. ఈ నెల 6న జరిగే రేవంత్‌రెడ్డి సభకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుయాదవ్, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షుడు జె.చంద్రశేఖర్(మహబూబ్‌నగర్), వెంకటేశ్ (దేవరకద్ర), తుల సిరాజ్(మక్తల్), పట్టణ అధ్యక్షుడు ఎండి.సల్మాన్, శ్రీశైలం యాదవ్, రాఘవేందర్, కుర్వ నరేష్, రవీందర్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజాదీవెన సభ ఏర్పాట్ల పరిశీలన


ఎంవీఎస్ మైదానాన్ని పరిశీలిస్తున్న వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో ఈ నెల 6న నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు ప్రజాదీవెన సభ ఏర్పాట్లను ఆదివారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. మైదానంలో తిరిగి వాహనాల పార్కింగ్, వేదిక ఏర్పాటు తదితర వాటిపై నాయకులతో కలిసి చర్చించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలను ఏం ముఖం పెట్టుకొని ఓట్లడుగుతారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో హన్వాడ మండల బీఆర్‌ఎస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతు రుణమాఫీతో పాటు రైతుబంధు, కల్యాణలక్ష్మి పథకాల అమలు చేయకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. గ్రామాల్లోకి కాంగ్రెస్ నాయకులు వస్తే నిలదీసే పరిస్థితులు వచ్చిందన్నారు. పంటలకు నీరులేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంట పొలాలకు కరెంటు సరిగ్గా ఇవ్వడం లేదని వాపోయారు. పెన్షన్లు సకాలంలో రాక ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులను అధికార కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్‌లో మంచి అవకాశాలు వస్తాయన్నారు. అక్రమ కేసులు, తప్పుడు కేసులకు భయపడొద్దని, న్యాయపరంగా ముందుకు సాగుదామన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో అందరు కష్టపడి పనిచేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమన్నారు. సమావేశంలో ఎంపీపీ బాల్‌రాజ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు కొండా లక్ష్మయ్య, రమణారెడ్డి, కొండా బాలయ్య, కృష్ణయ్యగౌడ్, నరేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచే కవిత్వం రావాలి


మాట్లాడుతున్న గోరటి వెంకన్న

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

కందనూలు: ప్రజల నుంచే కవిత్వం రావాలని ఆ దిశగా ఏర్పడిన సంఘమే అభ్యుదయ రచయితల సంఘమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ సమావేశ మందిరంలో అభ్యుదయ రచయితల సంఘం (అ.ర.సం) ఉమ్మడి జిల్లా మహాసభలు జిల్లా అధ్యక్షుడు కల్వకోలు మద్దిలేటి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా గోరటి వెంకన్న హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం రాక ముందే ప్రగతిశీల భావాలతో ఏర్పడ్డ సమాజంలో అభ్యుదయ కవులెందరో పనిచేశారని.. కొడుగంటి కుటుంబరావు, బొల్లిముంత సాంబశివరావు, రాచమల్లు, చా.సో., తాపీ ధర్మారావు, వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి కృష్ణమాచార్యలాంటి మహా కవులు అభ్యుదయ సంఘాన్ని నడిపారని చెప్పారు. వీరికన్నా ముందు గౌతమ బుద్ధుడు, మహాత్మా జోతిరావు పూలే, వీరబ్రహ్మం, వేమన, కబీరు, నారాయణగురు, అంబేడ్కర్‌లాంటి ఎందరో మహనీయులు పోరాడిన మార్గమే అభ్యుదయ మార్గమని, సంఘం పుట్టుకకు కారణమని వివరించారు. జాతీయ నాయకుడు వేల్పుల నారాయణ మాట్లాడుతూ... 1936లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ప్రొగ్రెసివ్ రైటర్స్ ఏర్పడిందని, 1943లో తెనాలిలో మొదటి మహాసభ జరిగిందని.. నాటి నుంచి నేటి వరకు తాడిత పీడిత ప్రజల పక్షాన పోరాడుతున్న ఏకైక సంఘం అ.ర. సంఘమని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నైజాములను పరుగులు పెట్టించిన చరిత్ర అభ్యుదయ రచయితలు, కవులదని కొనియాడారు. రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ.. నేటి సమాజంలో కులం, మతానికి వ్యతిరేకంగా కవులు సాహిత్యం సృష్టించాలన్నారు. పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు రాఘవాచారి మాట్లాడుతూ.. మతోన్మాదాలను అరికట్టాలంటే ప్రగతిశీల భావాలుగల రచయితలంతా ఏకం కావాల్సిన అవసరముందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి ఏలేశ్వరం వెంకటేష్, డా. పెబ్బేటి మల్లికార్జున్, బొడ్డుపల్లి సాయిశంకర్, సీపీఐ రాష్ట్ర నాయకుడు ఆనంద్‌జీ, సీనియర్ జర్నలిస్ట్ కందికొండ మోహన్, డా. భీంపల్లి శ్రీకాంత్, కె.లక్ష్మణ్‌గౌడ్, కవులు వనపట్ల సుబ్బయ్య, వహీద్‌ఖాన్, ఎదిరేపల్లి కాశన్న, కె.శ్యామల, పద్మావతి, డా. ఎల్.విజయ, హరిని, కేపీ లక్ష్మీనరసింహ, ప్రతాప్ కౌటిల్య, గుడిపల్లి నర్సింహారెడ్డి, కళాకారులు సంఘం కురుమూర్తి, గోపాల్, పర్వతాలు సంతోష్ సురేష్, మధు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను పరిరక్షించుకోవాలి


కళాకారుడిని సన్మానిస్తున్న బాద్మి శివకుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రాచీన పద్యనాటక కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ అన్నారు. మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో మిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో పద్యనాటక ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి పలు శాస్త్రీయ నృత్యాలు, పద్యనాటకాలను ప్రదర్శించారు. సిరి మువ్వ నృత్యం అకాడమీ చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేశంపేట మండలం భైర్కాన్‌పల్లికి చెందిన లక్ష్మీనరసింహస్వామి కళా మండలిచే రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణరాయబారం, మదనాపురం మండలం అజ్జకోలుకు చెందిన కళాబృందంచే మయసభ దుర్యోధన, వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్రలోని ఘట్టాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా బాద్మి శివకుమార్ మాట్లాడుతూ.. నాటక రంగం పూర్వవైభవం సంతరించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. నాటక ప్రదర్శనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో 40 ఏళ్ల నుంచి పద్యనాటక ప్రదర్శనలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. అదేవిధంగా సెంట్రల్ ఫిలీం సెన్సార్ బోర్డు మెంబర్ టీవీ రంగయ్య మాట్లాడుతూ కళాకారులకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం నాటకరంగ కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త సింగారం శ్రీనివాస్, మిత్ర కళానాట్య మండలి కార్యనిర్వాహక కార్యదర్శులు నర్సింహులు, దత్తాత్రేయ చారి, భాస్కరాచారి, ఆంజనేయులు, కురుమూర్తి, బ్రహ్మాచారి, విష్ణు, శ్రీహరి పాల్గొన్నారు.

బీచుపల్లి ఆలయంలో షాద్‌నగర్ ఏసీపీ



ఎర్రవల్లి చౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి అంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా అంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మారుతిచారి ఏసీపీ దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ విశిష్టతను గురించి వివరించారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికకు ప్రేమ వల

నాగర్‌కర్నూల్ క్రైం: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను ప్రేమ పేరుతో పెళ్లి చేసుకునేందుకు యత్నించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు షీటీం అధికారి వెంకటయ్య ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినికి ఇన్‌స్టాగ్రామ్‌లో హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆ యువకుడు బాలికను ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు వెళ్లేందుకు నాగర్‌కర్నూల్ బస్టాండ్‌కు వచ్చింది. బస్టాండ్‌లోని ఓ ప్రయాణికుడి ఫోన్ ద్వారా బాలిక సదరు యువకుడితో మాట్లాడటంతో అనుమానం వచ్చిన ప్రయాణికుడు షీటీంకు సమాచారం అందించారు. షీటీం సిబ్బంది ఆర్టీసి బస్టాండ్‌కు చేరుకొని వివరాలను సేకరించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను ప్రేమ పేరుతో వివాహం చేసుకోవాలనుకున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు షీటీం అధికారి తెలిపారు.

ఎద్దులబండ్లను ఢీకొట్టిన డీసీఎం


గాయపడిన ఎద్దుకు చికిత్స చేస్తున్న డా. మధుసూధన్

అడ్డాకుల: మూసాపేటలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు ఎద్దులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. తుంకినీపూర్‌కు చెందిన 10 ఎద్దుల బండ్లు ఇసుక తరలింపునకు తెల్లవారుజామున మూసాపేట మీదుగా పెద్దవాగుకు బయలుదేరాయి. ఈద్గా సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన డీసీఎం మూడు బండ్లను ఢీకొట్టడంతో రాములు, మహేష్, అంజికి చెందిన ఎద్దులబండ్లు దెబ్బతినగా.. ఎడమ వైపున ఉన్న మూడు ఎద్దులకు గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు బండ్లపై ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తరలించి గాయపడిన ఎద్దులను సమీపంలోని చెట్టు కింద ఉంచారు. ఉదయం మండల పశువైద్యాధికారి డా. మధుసూధన్, సిబ్బంది చంద్రమోహన్‌గౌడ్ చికిత్స అందించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

కుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

దామరగిద్ద: పిచ్చికుక్కల దాడిలో 16 గొర్రెలు మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని దేశాయిపల్లికి చెందిన గొర్రెలకాపరి సాలె హన్మంతు తన గొర్రెలను శనివారం రోజులాగే మేతకు తీసుకెళ్లి రాత్రి గ్రామశివారులో నిలిపి చుట్టూ వల కట్టారు. అక్కడే హన్మంతుతో పాటు కుమారుడు అంజిలప్ప కాపాలా ఉన్నారు. అర్ధరాత్రి సమయంలో ఒకేసారి 10 కుక్కలు మందపై దాడి చేశాయి. గొర్రెల అరుపులు విని నిద్ర లేచేసరికి 16 గొర్రెలు చనిపోగా.. మరో 20 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

రామన్‌పాడులో 1,015 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. ఆదివారం 1,015 అడుగులకు చేరింది. కొత్తపల్లి ఊకచెట్టు వాగు వంతెన కింద నీటి మట్టం తగ్గింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.